క్లుప్తంగా

నేడు 'గడప గడపకు మన ప్రభుత్వం'

కర్నూలు (న్యూటౌన్): కర్నూలు మండలం నందనపల్లె గ్రామంలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కర్నూలు ఎంపీడీఓ అజాంఖాన్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ హాజరవుతారన్నారు. మండల పరిధిలోని అన్ని శాఖల అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తప్పకుండా హాజరు కావాలని కోరారు.

భూ సమస్యలు పరిష్కరించండి

సి.బెళగల్: మండలంలోని పలు గ్రామాలకు చెందిన రైతులు తమ భూ సమస్యలను పరిష్కరించాలని స్పందనలో అధికారులకు అర్జీలు సమర్పించారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండల అధికారులు స్పందన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కొత్తకోట, తిమ్మందొడ్డి, ఇనగండ్ల గ్రామాలకు చెందిన రైతులు భూ సమస్యలపై తహసీల్దార్ శేషఫణికు అర్జీలు ఇచ్చారు. అదే విధంగా ముడుమాల, గుండ్రేవుల, కొండాపురం గ్రామాలకు చెందిన ప్రజలు రోడ్డుకు మరమ్మతు పనులు చేపట్టి, నదీతీర గ్రామాలకు ఆర్టీసీ బస్సు సేవలను పునరుద్ధరించాలని విన్నవించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ సందీప్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గోనేనాయక్, ఎంఈఓ జ్యోతి, ఏఓ మల్లేష్‌కుమార్ తదితరులు ఉన్నారు.

మహిళ అదృశ్యం



భార్గవి (ఫైల్)

గూడూరు: పట్టణంలోని సంజీవయ్య నగర్‌కు చెందిన మాల భార్గవి (22) అదృశ్యమైనట్లు సోమవారం పోలీసులకు ఫిర్యాదు అందింది. వివరాలు.. మాల భార్గవికి ఏడేళ్ల కిందట కర్నూలు పట్టణానికి చెందిన బాల మద్దయ్యతో వివాహం అయ్యింది. దంపతుల మధ్య గొడవలతో 8 నెలల కిందట గూడూరులోని జేజమ్మ ఇంటిలో ఉంటోంది. ఇటీవల భర్త తరపు బంధువులు వచ్చి కాపురానికి రావాలని పంచాయితీ చేసి వెళ్లారు. ఈ స్థితిలో సోమవారం మహిళ అదృశ్యమైంది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పవన్‌కుమార్ తెలిపారు.

రోడ్డుపైనే మురుగునీరు



రోడ్డుపై నిలిచిన నీరు

కల్లూరు: మండల పరిధిలోని లక్ష్మీపురం గ్రామంలో రోడ్డుపై నిత్యం నీరు నిలవడంతో గుంతలు ఏర్పడి ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపై నిలిచిన నీరు మురుగు కుంటను తలపిస్తుంది. ఆ రోడ్డు మీదుగానే దొడ్డిపాడు, బొల్లవరం, పుసులూరు, రెమడూరు, అనుగొండ వివిధ గ్రామాల ప్రజలు నిత్యం ప్రయాణిస్తుంటారు. అధికారులు స్పందించి రోడ్డుపై నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

పకడ్బందీగా ఇంటింటి సర్వే

కర్నూలు (టౌన్) : ఇంటింటి సర్వేను పకడ్బందీగా చేయాలని నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ ఆదేశించారు. సోమవారం నగరంలో బూతు స్థాయి అధికారులతో కలిసి సర్వేను కమిషనర్ పరిశీలించారు. స్థానిక నరసింగరావు పేటలో బీఎల్‌ఓలతో పాటు ఇంటి యజమానులతో కమిషనర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి పోలింగ్ స్టేషన్ పరిధిలో బీఎల్‌ఓలు మరింత బాధ్యతగా పనిచేయాలన్నారు. నిర్దేశించిన వివరాలతో సర్వే పక్కాగా చేపట్టాలన్నారు. క్షేత్ర స్థాయిలో ఏవైనా ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

బీరప్ప దేవాలయ నిర్మాణానికి విరాళం

కర్నూలు(అగ్రికల్చర్): పెద్దపాడు గ్రామంలో బీరప్ప స్వామి దేవాలయ నిర్మాణానికి గూడూరు మండలం పెంచికలపాడు గ్రామానికి చెందిన కురువ కులస్తులు విరాళం ఇచ్చారు. గ్రామ కులస్తులు రూ.65వేలు, గాదె కృష్ణ రూ.25 వేలు, మలేరియా సుంకయ్య రూ.10 వేల ప్రకారం ఇచ్చారని జిల్లా కురువ సంఘం ప్రధాన కార్యదర్శి రంగస్వామి తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కురువ సంఘం నేతలు తిరుపాల్, ఎల్లయ్య, తవుడు శ్రీనివాసులు, గూడూరు మండలం కురువ సంఘం నాయకుడు కృష్ణ, పెంచికలపాడు నాయకులు మద్దిలేటి, నగేష్, చిన్న గిడ్డయ్య , యుగంధర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

'శ్రీకృష్ణ భగవానుడే నిజమైన స్నేహితుడు'

కర్నూలు (న్యూసిటీ) : ప్రజల హితం కోరి భగవద్గీత అందించిన శ్రీకృష్ణ భగవానుడే మనకు నిజమైన స్నేహితుడు అని త్రైత సిద్ధాంతం హిందూ జ్ఞాన వేదిక ప్రబోధ సేవా సమితి కర్నూలు కమిటీ అధ్యక్షుడు నాగయ్య వెల్లడించారు. సోమవారం స్థానిక ఎఫ్‌సీఐ కాలనీలో భగవద్గీత గ్రంధాలను ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రబోధ సేవా సమితిసభ్యులు పాల్గొన్నారు.

ఓటర్ల లెక్క.. ఇక పక్కా!

- ఇంటింటికీ వెళ్లి సర్వే చేస్తున్న బీఎల్‌ఓలు
- కొత్త ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులకు అవకాశం
- కోడుమూరు నియోజకవర్గంలో 2,25,850 మంది ఓటర్లు
- ఈ నెల 21 వరకూ కొనసాగనున్న సర్వే



తాండ్రపాడులో ఇంటింటి సర్వేను తనిఖీ చేస్తున్న కర్నూలు ఆర్డీఓ హరిప్రసాద్

కర్నూలు (న్యూటౌన్): మీ ఓటు ఉందా?. ఉంటే ఎక్కడ ఉంది ? చిరునామా మార్చాలనుకుంటున్నారా? 18 ఏళ్లు నిండినా ఓటరుగా నమోదు కాలే దా ?ఇలాంటి ప్రతి సమస్యకు పరిష్కారం చూపేందుకు బీఎల్‌ఓలు ఇంటింటికీ వస్తున్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గత నెల 21వ తేదీ నుంచి ఓటర్ల సంక్షిప్త జాబితా సవరణ ప్రక్రియకు అధికార యంత్రాంగం శ్రీకారం చుట్టింది.

పకడ్బందీగా ఓటర్ల జాబితా..

ఓటర్ల జాబితాను మరింత మరింత పకడ్బందీగా, పారదర్శకంగా రూపొందించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌ఓ) వెరిఫికేషన్ ప్రక్రియను ప్రారంభించారు. గ్రామాల్లో ప్రతి ఇంటికీ వెళ్లి మొబైల్ యాప్‌లో ఓటర్ల పూర్తి వివరాలను నమోదు చేస్తున్నారు. సవరణలతో పాటు ఫొటో, అడ్రస్ మార్పులు వంటివి ఓటరు ఆమోదంతో చేస్తున్నారు.

2024 జనవరి నాటికి ప్రక్రియ పూర్తి

సార్వత్రిక ఎన్నికలు మరో 9 నెలల్లో జరగనున్న నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ప్రస్తుతం చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ 2024 కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. 2024 జనవరి 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండే ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని అధికారులు చెబుతున్నారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పూర్తి చేసి 2024 జనవరి 5వ తేదీన తుది జాబితాను ఎన్నికల కమిషన్ ప్రకటించనుంది. దీంతో ఓటరు జాబితా సవరణపై రాజకీయ పార్టీలు ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నాయి.

బీఎల్‌ఓలకు రిజిస్టర్లు, దరఖాస్తులు..

ఓటరు జాబితా సవరణలో భాగంగా గత నెల 21వ తేదీన ప్రారంభమైన ఇంటింటి సర్వేలో పాల్గొనే బీఎల్‌ఓల చేతికి ఓటు సవరణకు సంబంధించి రిజిష్టర్లు, కొత్తగా ఓటరు నమోదుకు (ఫారం-6), ఓటు తొలగింపునకు (ఫారం-7), నియోజకవర్గ పరిధిలో ఓటు బదిలీకి (ఫారం-8) దరఖాస్తులను జిల్లా యంత్రాంగం అందించింది. ఓటరు జాబితా సవరణకు సంబంధించి ఇప్పటికే బీఎల్‌ఓలకు శిక్షణ ఇచ్చారు. సవరణ పక్కాగా చేపట్టేందుకు బీఎల్‌ఓలు ఓటరు యాప్ (వెర్షన్ 4.7) ఇన్‌స్టాల్ చేశారు. కొత్త ఓటు నమోదు, పాతవి తొలగించడం యాప్‌లోనే చేయాల్సి ఉంటుంది. కొత్తగా ఓటు హక్కు పొందాల్సిన వారు దరఖాస్తు నింపి బీఎల్‌ఓలకు అందించాలి. ఒకే కుటుంబంలో ఓటర్లందరినీ ఒకే పోలింగ్ స్టేషన్‌కు అనుసంధానించేందుకు ఇంటింటా సర్వే ఉపయోగపడుతుంది.

విస్తృతంగా అవగాహన..

ఓటర్ల సవరణ ప్రక్రియపై ప్రజలకు అధికార యంత్రాంగం విస్తృతంగా అవగాహన కల్పిస్తోంది. వివిధ ప్రసార మాధ్యమాల ద్వారా ప్రచారం చేయడంతో పాటు బీఎల్‌ఓలకు, సంబంధిత అధికారులకు అవగాహన కల్పించారు. వివిధ రాజకీయ పార్టీల నాయకులతో కూడా అధికారులు సమావేశాలు నిర్వహించారు. ఓటర్ల సవరణ ప్రక్రియకు సహకరించాలని కోరారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పారదర్శకమైన ఓటరు జాబితాను సిద్ధం చేసేందుకు పూర్తి సహకారం అందించాలని అధికారులు రాజకీయ పార్టీల నాయకులు, ఓటర్లను కోరుతున్నారు.

కోడుమూరు నియోజకవర్గంలో నాలుగు మండలాల ఓటర్ల సంఖ్య ..

మండలం	స్త్రీలు	పురుషులు	ఓటర్ల సంఖ్య
కోడుమూరు	27,958	27,675	55,633
గూడూరు	17,513	17,601	35,116
సి బెళగల్	20,614	21,191	41,805
కర్నూలు	47,079	46,209	93,293
ఇతరులు			3
మొత్తం			2,25,850

ఓటు సరి చూసుకోవాలి



బీఎల్‌ఓలు ఇంటింటి సర్వేకు వచ్చినప్పుడు ఓటరు ఐడీ కార్డులు, పేరు, చిరునామా, వయస్సు, ఆధార్ ఇతర వివరాలు సరి చూసుకోవాలి. ఫొటో సరిగా లేకపోతే అక్కడికక్కడే అప్‌డేట్ చేసుకోవాలి. తప్పులు సరిదిద్దేందుకు అవసరమైన ఆధారాలను బీఎల్‌ఓలకు సమర్పించాలి. ప్రక్రియను పారదర్శకంగా, సజావుగా, గడువులోగా పూర్తయ్యేందుకు బీఎల్‌ఓలకు ప్రజలు, రాజకీయ పార్టీ నాయకులు సహకరించాలి. ఇంటింటా సర్వేను ఓటర్లందరూ సద్వినియోగం చేసుకోవాలి.

– సి హరిప్రసాద్, ఆర్డీఓ, కర్నూలు

పకడ్బందీగా ఓటర్ల జాబితా సవరణ



ఓటరు జాబితా సవరణ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాం. ఓటరు జాబితాలో డబుల్ ఎంట్రీలు, డిలీషన్లను పక్కా ఆధారాలతో నిశితంగా పరిశీలించి ఓటర్ల జాబితా నుంచి తొలగిస్తాం. వచ్చే జనవరి 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేసేందుకు కసరత్తు చేస్తున్నాం. ఓటర్ల జాబితా సవరణను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలి. – ఆర్ శివరాముడు, తహసీల్దార్, కర్నూలు రూరల్

మిరప పంట పరిశీలన

కోడుమూరు రూరల్ : మండలంలోని ప్యాలకుర్తి గ్రామంలో వైరస్ సోకడంతో గొర్రెలకు మేతగా వదిలేసిన మిరప పంటను సోమవారం కోడుమూరు ఏఓ రవిప్రకాష్ పరిశీలించి రైతులతో చర్చించారు. ఏఓ మాట్లాడుతూ గ్రామంలో 120 ఎకరాల వరకు మిరప పంటను రైతులు సాగు చేశారన్నారు. వర్షాభావం, అధిక వేడి, వాతావరణ మార్పుల వల్ల పంటకు వైరస్ తెగులుతో పాటు రసం పీల్చే పురుగులు సోకాయన్నారు. గ్రామంలో కొందరు రైతులు కొంత మిరప దిగుబడులు కూడా తీశారని, షఫివుల్లా రైతు మాత్రమే పంట బాగా రానందున గొర్రెలకు మేతగా వదిలేశాడన్నారు. మిరప పంటకు వైరస్ తెగుళు సోకిన రైతులంతా వెంటనే 400 ఎంఎల్ క్లోరోతలని, 2కేజీలు 13–0–45, ఒక కేజీ ఫార్ములా ఫోర్ కలిపి ఎకరానికి పిచికారీ సూచించారు.

'సుంకేసుల'లో 1.026 టీఎంసీల నీరు నిల్వ

గూడూరు: సుంకేసుల జలాశయంలో 1.026 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు డ్యాం అధికారులు సోమవారం తెలిపారు. ఇన్‌ఫ్లో నిలిచి పోయిందని, కర్నూలు ప్రజల తాగునీటి అవసరాల కోసం 130 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశామన్నారు.

రహదారి విస్తరణ చేపట్టండి

గూడూరు: పట్టణంలో ట్రాఫిక్ సమస్య రోజురోజుకు ఎక్కువ అవుతోందని, రహదారులను విస్తరించాలని 2, 10 , 11వ వార్డు కౌన్సిలర్లు బుడ్డెంగలి, బాషా, సురేష్‌లు సోమవారం కమిషనర్ ప్రసాద్‌గౌడ్ కు వినతి పత్రం అందించారు. నగర పంచాయతీ కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమంలో వారు కమిషనర్‌ను కలిసి సమస్యను విన్నవించారు.

అంతర పంటల సాగుతో అధిక లాభాలు



బురాన్‌దొడ్డిలో పొలాలను పరిశీలిస్తున్న ఏఓ మల్లేష్‌కుమార్

సి.బెళగల్: రైతులు సాగుచేసిన పంటలలో అంతర పంటలను వేసుకుంటే అధిక లాభాలను పొందవచ్చని ఏఓ మల్లేష్‌కుమార్ తెలిపారు. సోమవారం ఆయన మండల పరిధిలోని బురాన్‌దొడ్డి, క్రిష్ణదొడ్డి గ్రామాలలో పర్యటించి, రైతులకు పంటల సాగులో పాటించాల్సిన మెలకువలను తెలియజేశారు. రైతులు వర్షాభావ పరిస్థితులకు అనుగుణంగా పంటలను సాగు చేసుకోవాలన్నారు. పత్తి పంటలో కంది, కందిలో సజ్జ, వేరుశనగ, కొర్ర పంటలను అంతరంగా సాగు చేసుకోవడం వల్ల ఒకే సీజన్‌లో అధిక ఆదాయం పొందవచ్చని వివరించారు. అలాగే వ్యవసాయ భూములు సారవంతంగా మారుతాయని తెలిపారు. అదేవిధంగా కంది పంటల సాగులో మిశ్రమ పంటలుగా మినుము, పెసర, అలుసంద తదితర పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలని సూచించారు. అనంతరం గ్రామంలోని ఆర్బీకేను తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. వీఏఏ మారెప్ప, ఎంపీఈఓ వెంకటేష్, రైతులు రమేష్, గొల్ల గోపాల్, నాగేష్ తదితరులు ఉన్నారు.

12 మంది దివ్యాంగులకు ఫిజియోథెరపీ



ఫిజియోథెరపీని పరిశీలిస్తున్న ఎంఈఓ జ్యోతి

సి.బెళగల్: స్థానిక భవిత కేంద్రంలో 12 మంది దివ్యాంగులకు ఫిజియోథెరపీ నిర్వహించినట్లు ఎంఈఓ జ్యోతి తెలిపారు. సోమవారం ఆమె ఫిజియోథెరపీ క్యాంప్‌ను పరిశీలించారు. ఎంఈఓ మాట్లాడుతూ.. మండలంలోని పలు గ్రామాల నుంచి వచ్చిన దివ్యాంగులకు బాల్, పాడ్స్ తదితర పరికరాలపై ముడుచుకపోయిన కాళ్లకు, చేతులకు ఫిజియోథెరపిస్ట్ వీరేష్ వ్యాయామం చేయించారన్నారు. ప్రతి సోమవారం దివ్యాంగులకు నిర్వహించే ఉచిత ఫిజియోథెరపి క్యాంప్‌ను మండల ప్రజలు, దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ వీరేష్ కోరారు. అదేవిధంగా ప్రత్యేక అవసరాలుగల చిన్నారులకు ఐఈఆర్‌టీలు మద్దిలేటి, సోమశేఖర్‌రెడ్డి ప్రత్యేక బదిర బాలలకు పరికరాలతో విద్యను అందించారు.

మిరప పైరు పరిశీలన



ప్యాలకుర్తిలో వైరస్ సోకిన మిరప పైరును పరిశీలిస్తున్న ఏఓ రవిప్రకాష్

కోడుమూరు రూరల్: మండలంలోని ప్యాలకుర్తి గ్రామంలో వైరస్ సోకడంతో ఎదుగుదల లేక గొర్రెలకు మేతగా వదిలేసిన మిరప పంటను సోమవారం ఏఓ రవిప్రకాష్, హార్టికల్చర్ ఆఫీసర్ మధన్‌మోహన్ పరిశీలించి రైతులతో చర్చించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. గ్రామంలో 120 ఎకరాల్లో రైతులు మిరప పైరు సాగుచేశారని, మే నెలలో పంట సాగు చేయడం, జూన్, జూలై నెలల్లో వర్షాలు లేక పోవడం, అధిక వేడి వాతావరణం వల్ల మిరప పంటకు వైరస్ తెగులుతో పాటు, రసం పీల్చే పురుగులు సోకాయన్నారు. గ్రామంలో కొందరు రైతులు కొంతమేర మిరప దిగుబడులు కూడా పొందారని, రైతు షఫివుల్లా మాత్రమే పంట బాగా రానందున గొర్రెలకు మేతగా వదిలేశాడన్నారు. మిరప పంటకు వైరస్, తెగుళ్లు సోకితే ఎకరానికి 400 ఎంఎల్ క్లోరోతలని, 2 కేజీలు 13–0–45, ఒక కేజీ ఫార్ములా ఫోర్ కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు.

వీధి లైట్లు లేక అవస్థలు

పాణ్యం: మండల కేంద్రంలో జాతీయ రహదారి నుంచి గోరుకల్లు తాండాలోకి వెళ్లేందుకు రోడ్డుకు ఇరువైపులా విద్యుత్ దీపాలు లేకపోవడంతో గ్రామస్తులు అవస్థలు పడుతున్నారు. రాత్రి వేళ లైటింగ్ లేని కారణంగా ప్రజలు కాలినడకన వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు చొరవ తీసుకొని వీధి దీపాలు వేయించాలని తండావాసులు కోరతున్నారు.

చేనేతలకు అండగా ప్రభుత్వం



కోడుమూరులో వృద్ధ చేనేత కార్మికుడిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

కోడుమూరు రూరల్: చేనేత రంగం అభివృద్ధికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోందని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ పేర్కొన్నారు. సోమవారం కోడుమూరులో నిర్వహించిన 9వ జాతీయ చేనేత దినోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై కుర్నీ కార్పొరేషన్ డైరెక్టర్ సీబీ.కృష్ణవేణితో కలిసి చేనేత జెండాను ఆవిష్కరించారు. వృద్ధ చేనేత కార్మికులను దుశ్శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం చేనేత కార్మికులకు వైఎస్సార్ నేతన్న నేస్తం ద్వారా ఏడాదికి రూ.24 వేల చొప్పున నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తున్నారన్నారు. తమకు చేనేత గుర్తింపు కార్డులు లేక ఇబ్బందులు పడుతున్నామని, పక్కా ఇళ్లు మంజూరు చేయాలంటూ కొందరు కార్మికులు విన్నవించగా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అర్హులైన వారికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఎంపీటీసీ మణి, వైఎస్సార్‌సీపీ, చేనేత కార్మిక సంఘం నేతలు సీబీ.అజయ్‌కుమార్, రాజశేఖరరెడ్డి, లాయర్ ప్రభాకర్, ఏకాంబరం, దానకర్ణ, వెంకటేశ్వర్లు, మాధవస్వామి, గోట్ల విజయ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జన బావి పరిశీలన

స్థానిక వెంకటగిరి రోడ్డులో వినాయక నిమజ్జన కమిటీ సభ్యులు నూతనంగా తవ్వించిన నిమజ్జన బావిని ఎమ్మెల్యే సుధాకర్ సోమవారం పరిశీలించారు. గతంలో వినాయక విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు సౌకర్యం లేక భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని, ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం స్థలం కేటాయించడంతో బావిని తవ్వించినట్లు కమిటీ సభ్యులు చెప్పారు. కమిటీ సభ్యులు ప్రతాప్‌రెడ్డి, కిరణ్, నాగేశ్వరరావు, తాయప్ప, నటరాజ్ తదితరులు ఉన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దళారీ వ్యవస్థ లేకుండా నేరుగా అర్హులైన లబ్ధిదారుల గడప వద్దకే చేరుతున్నాయని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ అన్నారు. సోమవారం మండలంలోని వెంకటగిరి గ్రామంలో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించి నాలుగేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరించి ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. గ్రామంలో మూడు రోజులకోసారి నీరు వస్తుండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, సొంత స్థలాలు కలిగిన వారికి ఇళ్లు నిర్మించుకునేందుకు జగనన్న గృహ నిర్మాణ పథకం కింద సహకారం అందించాలని కోరగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. నీటి సమస్యను పరిష్కరించి, అర్హులైన వారందరికీ ఇళ్లు మంజూరయ్యేలా చూడాలని ఎంపీడీఓ చంద్రశేఖర్, హౌసింగ్ ఏఈ లక్ష్మన్నను ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ 70 ఏళ్ల దేశ పాలనలో ఏనాడూ లబ్ధిదారుల ఇంటి ముంగిటకే ప్రభుత్వ పథకాలు అందడంతో పాటు, ప్రతి గడప వద్దకు ఎమ్మెల్యేలు వచ్చిన సంఘటన లేదని వైఎస్సార్‌సీపీతోనే అది సాధ్యమైందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నేరవేర్చారన్నారు. సీఎం జగనన్నను మరోసారి గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. ఎస్‌ఐ శ్రీనివాసులు, ఏఓ రవిప్రకాష్, ఏపీఎం పుష్పావతి, ఏఈలు ప్రసాద్, గంగరాజు, డీటీ రామాంజినేయులు, సర్పంచులు బాలకృష్ణ, మధుసూదన్ రెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



మహిళకు సంక్షేమ క్యాలెండర్ అందిస్తున్న ఎమ్మెల్యే

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కర్నూలు : రోడ్డు ప్రమాదంలో గాయపడిన జొహరాపురం గ్రామానికి చెందిన ఖాదర్ బాషా (55) కోలుకోలేక ఆదివారం రాత్రి మృతిచెందాడు. ఈయన గౌండ పని చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. ఈ నెల 4వ తేదీ ద్విచక్ర వాహనంపై జొహరాపురం వెళ్తూ మార్గమధ్యంలో అదుపు తప్పి కింద పడి తీవ్ర గాయాలకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు ఆసుపత్రిలో చేర్పించి చికిత్స చేయించగా కోలుకోలేక మృతిచెందాడు. ఈయనకు ఇద్దరు కుమారులు సంతానం. ఒకటో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సర్పంచ్, వార్డు స్థానాలకు ఎన్నికలు

కర్నూలు (న్యూటౌన్): జిల్లాలో ఖాళీగా ఉన్న గ్రామ పంచాయతీ సర్పంచ్, వార్డు స్థానాలకు ఎన్నికలు నిర్వహించేందుకు నోటిఫికేషన్ జారీ చేసినట్లు కర్నూలు ఎంపీడీఓ అజాంఖాన్ స్పష్టం చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మండల పరిధిలో నాలుగు వార్డు స్థానాలు ఖాళీగా ఉన్నాయని, వాటికి ఈ నెల 8వ తేదీ నుంచి నామినేషన్లు స్వీకరించనున్నట్లు వెల్లడించారు. కర్నూలు మండలం ఆర్‌కే దుద్యాలలో 4వ వార్డు (అన్ రిజర్వుడ్), ఉల్చాలలో 11వ వార్డు (అన్ రిజర్వుడ్), జి శింగవరంలో 2వ వార్డు (అన్ రిజర్వుడ్ ఉమెన్), దిగువపాడులో 8వ వార్డుకు (అన్ రిజర్వుడ్)కు ఎన్నికలు జరగనున్నట్లు వివరించారు. పోటీ చేయాలనుకునే అభ్యర్థులు ఈ నెల 8 నుంచి 9,10వ తేదీల్లో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లు సమర్పించవచ్చన్నారు. 11వ తేదీ నామినేషన్ల పరిశీలన ఉంటుందన్నారు. 13వ తేదీ ఎన్నికల అథారిటీకి అభ్యర్థులు తమ అభ్యర్థనలను సమర్పించవచ్చన్నారు. 14వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు అభ్యర్థులు తమ నామినేషన్లు ఉపసంహరించుకునే అవకాశం ఉందన్నారు. అదే రోజు సాయంత్రం పోటీలో ఉన్న అభ్యర్థుల పేర్లను ప్రకటిస్తామన్నారు. ఈ నెల 19వ తేదీ ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్, అదే రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ఉంటుందన్నారు. అనంతరం గెలిచిన అభ్యర్థులను ప్రకటిస్తామని, అనుకోని సంఘటనలు జరిగితే ఆయా ప్రాంతాల్లో రీపోలింగ్ ఈ నెల 20వ తేదీ ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించనున్నట్లు స్పష్టం చేశారు.

ఎన్నికలకు స్టేజ్ -1 అధికారుల నియామకం

మండల పరిధిలోని నాలుగు గ్రామాల్లో ఖాళీగా ఉన్న సర్పంచ్, వార్డు స్థానాల ఎన్నికలకు సంబంధించి జిల్లా కలెక్టర్ డాక్టర్ జి సృజన, జిల్లా పంచాయతీ అధికారి నాగరాజు నాయుడు ఆదేశాల మేరకు స్టేజ్ -1 అధికారులను నియమించినట్లు కర్నూలు ఎంపీడీఓ అజాంఖాన్ తెలిపారు. ఉల్చాల గ్రామంలోని 11 వార్డుకు స్టేజ్ - 1 అధికారిగా కె వినోద్‌కుమార్ (కర్నూలు రూరల్ 2 ఎంఈఓ), ఆర్ కే దుద్యాల 4వ వార్డుకు నాగేశ్వర్‌రెడ్డి (కర్నూలు ఈఓఆర్డీ), దిగువపాడులో 8వ వార్డుకు రవిమోహన్‌రెడ్డి (పీఆర్ ఏఈ), జి శింగవరంలో 2వ వార్డుకు రంగస్వామి (ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ)ని నియమించారని పేర్కొన్నారు.

నేటి నుంచి నామినేషన్ల స్వీకరణ

పాణ్యం : మండలంలో ఖాళీగా ఉన్న రెండు వార్డులకు నేటి నుంచి నామినేషన్లు స్వీకరిస్తున్నట్లు ఈఓఆర్డీ భాస్కర్‌రావు సోమవారం తెలిపారు. కొండజుటూరు గ్రామంలోని 1వ వార్డుకు, కౌలురులోని 5వ వార్డుకు ఉప ఎన్నికలు జరుగుతాయన్నారు.

కోడుమూరు మండలంలో రెండు స్థానాలకు..

కోడుమూరు: మండలంలో ఖాళీగా ఉన్న ప్యాలకుర్తి గ్రామంలో వార్డుమెంబర్-6 (ఎస్సీ-మహిళ), గోరంట్ల గ్రామంలో వార్డుమెంబర్-1(ఎస్సీ-మహిళ) స్థానాలకు ఎన్నిక నిర్వహించేందుకు ఎన్నికల సంఘం నోటిఫికేషన్ ఇచ్చినట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్ సోమవారం తెలిపారు. ఎన్నికల అధికారులుగా ప్యాలకుర్తి గ్రామ పంచాయతీకి పీఆర్ ఏఈ గంగరాజు, గోరంట్ల గ్రామ పంచాయతీకి ఈఓఆర్డీ మంజుల వ్యవహరిస్తారని పేర్కొన్నారు.

నాణ్యమైన తాళ్లకు కేరాఫ్ 'ఉయ్యాలవాడ' సిస్టర్స్

- కందికాయపల్లెలో 20ఏళ్లుగా తాళ్లు నేస్తున్న అక్కాచెల్లెళ్లు
- వ్యవసాయ అనుబంధ తాళ్లను తయారు చేసి ఇతర రాష్ట్రాల్లో విక్రయాలు
- ప్రతి వారం రూ.2లక్షల వ్యాపారం
- వారితో పాటు మరో నలుగురికి ఉపాధి



తయారు చేసిన తాళ్లను పరిశీలిస్తున్న ఎంపీపీ ఉసేన్‌బీ, డీఆర్‌డీఏ సిబ్బంది

పాణ్యం: కందికాయపల్లెకు చెందిన అక్కాచెల్లెళ్లు 20 ఏళ్లుగా వ్యవసాయానికి అవసరమయ్యే తాళ్లను నాణ్యతగా తయారు చేస్తూ వ్యాపారంలో రాణిస్తున్నారు. రైతులకు నమ్మకం కలగడంతో ముందుగానే ఆర్డర్లు ఇచ్చి మరీ తాళ్లను తయారు చేయించుకుంటున్నారు. వారితో పాటు మరో నలుగురికి ఉపాధినిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.


ఆర్డర్లపై తయారీ..

పాణ్యం మండలం కందికాయపల్లె గ్రామానికి చెందిన ఉయ్యాలవాడ ఆదిలక్ష్మి, జయమ్మ అక్కాచెల్లెళ్లు. వీరు 20 ఏళ్ల క్రితం చేతులతో తాళ్లను అల్లడం ప్రారంభించారు. అలా తయారు చేసిన తాళ్లను ఇతర పట్టణాల్లో అమ్ముకొని వచ్చే వారు. క్రమేణా తాళ్ల వాడకం పెరగడం, నాణ్యమైన తాళ్లను తయారు చేయడంతో రైతులు గ్రామానికి వచ్చి, లేదా ముందుగానే ఆర్డర్ ఇచ్చి అవసరానికి తగ్గట్టు తయారు చేయించుకునే స్థాయికి ఎదిగారు. తాళ్లు, ఎద్దుల సిక్కెంలు, మోకులు, చిన్న, పెద్దవి, ఎద్దుల పగ్గాలు, పగ్గిలు, వార్నెలు, దూడలకు చిన్న తాళ్లుకు, కాడికి కావల్సిన లావుపాటి తాళ్లను ఆర్డర్లపై తయారు చేస్తున్నారు. వీరి తాళ్లకు డిమాండ్ పెరగడంతో తయారీకి చిన్న పాటి మోటార్లను ఏర్పాటు చేసుకున్నారు. వీటితో వారానికి రూ.2లక్షల విలువ చేసే తాళ్లను తయారు చేసి తెలంగాణ రాష్ట్రంలోని జడ్చర్ల, మహబూబ్‌నగర్, కర్ణాటక రాష్ట్ర హద్దుల వరకు విక్రయిస్తున్నారు.

వారంలో ఐదు రోజులు పని..

తాళ్ల తయారీ వారంలో ఐదు రోజుల పాటు ఉంటుంది. నంద్యాల జిల్లా కొవెలకుంట్లలో ముడి సరుకు తెచ్చి ఆర్డర్ల తయారు చేస్తారు. ఇలా కుటుంబ సభ్యులు ఐదు మంది పని చేస్తూనే.. మరో నలుగురికి ఉపాధి కల్పిస్తున్నారు. ఐదు రోజుల తర్వాత ఆరో రోజు తాళ్లను విక్రయిస్తారు. వారం రోజుల వెచ్చించిన ఖర్చు పోను రూ.10వేల నుంచి రూ.15 వేల వరకు ఆదాయం వస్తుందని చెబుతున్నారు.


ప్రభుత్వం రాయితీ ఇస్తే మరింత విస్తరిస్తాం



ప్రస్తుతం చిన్న మోటార్ల సహాయంతో తాళ్లను తయారు చేస్తున్నాం. ఒక్కో వారికి రూ.2లక్షల విలువైన వస్తువులను తయారు చేస్తున్నాం. కొవెలకుంట్లలో తాళ్ల తయారీకి ఉపయోగించే రోల్స్‌లు తెచ్చుకుంటాం. ఐదు రోజుల పాటు పెద్ద, చిన్న తాళ్లు, ఎత్తుల సిక్కెంలు తయారు చేస్తాం. వీటికి బాగా డిమాండ్ ఉంది. రైతుల అర్డర్ల ప్రకారం వివిధ రకాల వస్తువులను తయారు చేస్తాం. వీటికి మా కుటుంబసభ్యులతో పాటు మరో నలుగురు కూలీలు అవసరమవుతారు. ప్రభుత్వం రాయితీ అందిస్తే తాళ్ల తయారీ మరింత పెంచాలని ఉంది. ఉన్నంత బడ్జెట్‌లో వీటిని తయారు చేసి అమ్ముతున్నాం. ఇప్పుడున్న చిన్న మోటార్లుకు బదులు పెద్ద మోటార్లు బిగించి మరింత ఉత్పత్తులను పెంచుతాం. వర్షా కాలంలో మోటార్లు తడిసిపోకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాం. ప్రతి సీజన్‌లో తాళ్లను తయారు చేస్తాం.

– ఉయ్యాలవాడ ఆదిలక్ష్మి, జయమ్మ

పెబ్బేరు సంతలో ఎక్కువగా అమ్ముతాం



మేము తయారు చేసిన తాళ్ల ను ఎక్కువగా తెలంగాణలోని పెబ్బేరులో అమ్ముతాం. వా రంలో ఒక రోజు వెళ్లి వీటిని అమ్ముకొని వస్తాం. అలాగే చూట్టు పక్కల పట్టణాల్లో కూడా మా తాళ్లను రైతులు బాగా ఇష్టపడతారు. గ్రామాల్లోకి వెళ్లినప్పుడు రైతులే స్వయంగా తమకు ఫలానా తాడు కావాలని చెబుతారు. ఆ ప్రకారం తయారు చేస్తాం. మా గ్రామం చూట్టు పక్కల గ్రామాల రైతులు కూడా ఇంటి వద్దకు వచ్చి కొని తీసుకెళ్తారు. రైతులు ముందుగానే చేప్పిన ప్రకారం తయారు చేసి అమ్మడం వలన మా వద్ద సరుకు నిల్వ ఉండదు.

– ఉయ్యాలవాడ రాముడు

ట్రాఫిక్ నిబంధనలు పాటించండి



ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ డీఎస్పీ నాగభూషణం

కర్నూలు: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పకుండా పాటించాలని ట్రాఫిక్ డీఎస్పీ నాగభూషణం సూచించారు. మండల పరిధిలోని చిన్నటేకూరు సమీపంలో ఉన్న బృందావన్ ఇంజినీరింగ్ కాలేజ్‌లో సోమవారం ట్రాఫిక్ నియమాలపై విద్యార్థినులకు ప్రొజెక్టర్ ద్వారా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ట్రాఫిక్ డీఎస్పీ హాజరై మాట్లాడుతూ లైసెన్స్ లేకుండా విద్యార్థినీ విద్యార్థులు వాహనాలపై కాలేజికి వస్తే ఎటువంటి పరిస్థితుల్లోనూ అనుమతించొద్దని కళాశాల నిర్వాహకులకు సూచించారు. పొరపాటున ప్రమాదం జరిగితే విద్యార్థులు పోలీసు కేసుల్లో ఇరుక్కుని ప్రభుత్వ ఉద్యోగాలకు అర్హత కోల్పోతారని హెచ్చరించారు. స్నేక్ డ్రైవింగ్, రాంగ్ రూట్ డ్రైవింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, త్రిబుల్ రైడింగ్ వంటివి ప్రమాదకరమన్నారు. వాహనాలను అతి వేగంగా నడపరాదన్నారు. ఇన్సూరెన్స్ లేని వాహనాలు కూడా నడపరాదన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని లైసెన్స్ లేని పిల్లలకు వాహనాలు ఇస్తే వారి తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ట్రాఫిక్ డీఎస్పీతో పాటు కాలేజ్ బోధన, బోధనేతర సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.